ప్రజాశక్తి

బుధవారం 29 జనవరి 2025

5

పార్వతీపురం మన్యం

డిజిపిని కలిసిన ఎస్‌పి

పార్వతీపురంరూరల్ : ఉత్తరాంధ్ర జిల్లాల పర్యటనలో భాగంగా విజయనగరం జిల్లాకు విచ్చేసిన సందర్భంగా డిజిపి ద్వారకా తిరుమల రావును ఎస్పీ ఎస్‌వి మాధవ్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. అనంతరం డిజిపి నిర్వహించిన సమీక్ష సమావేశం లో విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి పాల్గొన్నారు. సమీక్ష అనంతరం డిజిపిని ఎస్పీ దుశ్శాలువాతో సత్కరించి, సవర చిత్రపటాన్ని అందజేశారు.

డిజిపికి జ్ఞాపికను అందజేస్తున్న ఎస్‌పి మాధవరెడ్డి

సిరిమానోత్సవంలో పాల్గొన్న జనం

మొక్కు తీర్చుకుంటున్న మహిళ



- పట్టు వస్త్రాలను సమర్పించిన మంత్రి సంధ్యారాణి
- జాతరకు పోటెత్తిన జనం
- ఏర్పాట్లును పరిశీలించిన ఎస్‌పి, పిఒ

సిరిమానును తిలకిస్తున్న మంత్రి సంధ్యారాణి

'శంబర'ంగా జాతర

ప్రజాశక్తి - మక్కువ

ఉత్తరాంధ్రుల ఇలవేల్పుగా ప్రసిద్ధిగాంచిన శంబర పోలమాంబ అమ్మవారి సిరిమాను జాతర మంగళవారం వైభవంగా జరిగింది. సిరిమానోత్సవాన్ని తిలకించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా ఒడిశా, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. మంగళవారం వేకువ జామునుంచే అమ్మవారి దర్శనానికి ప్రజలు క్యూకట్టారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు అనంతరం కుటుంబ సభ్యులతో లకిసి అమ్మవారి ఘటాలను మోస్తూ మొక్కులు చెల్లించుకున్నారు మధ్యాహ్నం 3.30గంటలకు సిరిమాను సంబరం మొదలైంది. ఆలయ కమిటీ చైర్మన్ నైదాన తిరుపతిరావు , గ్రామ పెద్దల సమక్షంలో కమిటీ సభ్యులు పూజారి జన్ని పేకాపు రామారావును భుజాలపై మోసుకొని వచ్చి సిరిమాను అధిరోహింప చేశారు. తొలుత గిరడ వారి ఇంటి వద్ద పూజలు అందుకున్న అనంతరం అమ్మవారు నాయుడుగా పేరుందిన పూడి వారి ఇంటికి వెళ్లి పూజలు అందుకున్నారు. అనంతరం నడిమి వీధి మీదుగా ఎస్‌సి వీధి, పనుకువీధి, గొల్ల వీధి మీదుగా చావిడి వీధికి చేరుకున్నారు సాయంత్రం 6గంటలకు సిరిమానోత్సవం ముగిసింది. మారుజాతర వరకు చదురుగుడి వద్ద భక్తులు మొక్కులు తీర్చుకుంటారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ ఏర్పాట్లను దగ్గరుండి పరిశీలించారు.

ఏర్పాట్లను పరిశీలించిన ఎస్‌పి మాధవరెడ్డి

సిరిమానోత్సవం సందర్భంగా ఏర్పాట్లను, బందోబస్తును ఎస్‌పి మాధవరెడ్డి అదనపు ఎస్‌పి దిలీప్‌కిరణ్, ఎఎస్‌పి అంకిత సురానతో కలిసి పరిశీలించారు. అంతకుముందు చావిడి వీధిలో సిరిమాను ఊరేగింపు కార్యక్రమాన్ని పోలీసు రోప్ పార్టీ బందోబస్తు నడుమ అదనపు ఎస్‌పి, ఎఎస్‌పి డ్రోన్ కెమెరాలతో నిశితంగా పరిశీలించారు.

అలరించిన సాంస్కతి కార్యక్రమాలు

జాతర సందర్భంగా దేవాలయ శాఖ ఇఒ వివి సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సాంస్కతి కార్యక్రమాలు డప్పు వాయిద్యాలు భక్తులను అలరించాయి.

సాఫీగా అమ్మవారి దర్శనం

విశాలంగా ఏర్పాటు చేసిన క్యూలైన్లతో భక్తులు అమ్మవారిని సాఫీగా దర్శించుకున్నారు. ఏ విధమైన రద్దీ లేకుండా ప్రశాంతంగా నడుచుకుంటూ దర్శనానికి వీలు కల్పించారని భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.

జాతరలో అపశృతి ..నలుగురికి గాయాలు

సినిమాను ప్రారంభ సమయంలో నాయుడు వారి ఇంటికి సినిమాను చేరుకున్న తరుణంలో స్వల్ప అపశృతి చోటు చేసుకుంది. అమ్మవారిని నేరుగా దర్శించుకునేందుకు పూడి వెంకటరమణ ఇంటి మెట్లు ఎక్కిన భక్తులు ఒక్కసారిగా పిట్టగోడ పైకి రావడంతో గోడ కూలిపోయింది. ఈ ఘటనలో గజపతినగరం మండలం కొత్త బగ్గాంకు చెందిన పొందూరు జగదీష్‌కు గాయమైంది. కందులపదం గ్రామానికి చెందిన కొండ రామకృష్ణకు కూడా గాయాలయ్యాయి. వీరికి స్థానిక ఆసుపత్రిలో వైద్యులు చికిత్స అందజేశారు.

అమ్మవారిని దర్శించుకున్న అధికారులు

ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాత్సవ్ పోలమాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. డిఎంఅండ్‌హెచ్‌ఒ భాస్కరరావు, ఎంపిడిఒ స్వరూపరాణి, తహశీల్దార్ ఇబ్రహిం, పలువురు అధికారులు అమ్మవారిని దర్శించుకుకున్నారు.

నేడు పోలమాంబ అనుకోత్సవం

పోలమాంబ అమ్మవారిని బుధవారం వనం గుడిలో అనుపకోత్సవం చేపట్టనున్నారు. బుధవారం ఉదయం చదురు గుడి నుంచి అమ్మవారిని సావిడి వీధికి మేళ తాళాల మధ్య తీసుకొస్తారు. అక్కడ ఉయ్యాల, కంబాల అనంతరం భామాకలపం పూర్తయిన వెంటనే అమ్మవారికి మొక్కులు చెల్లించి దారి చూపడంతో గోముఖీ నది దాటిన వెంటనే పరుగు పరుగున వనం గుడికి చేరుకుంటారు. అక్కడ బలులు సమర్పించిన అనంతరం అమ్మవారి ఘటాలను వనం గుడిలో ఉంచుతారు. దీంతో జాతర మొదటి దశ పూర్తవుతుంది. ఆపై 9 వారాలు వనం గుడి వద్ద అమ్మవారిని భక్తులు దర్శించుకోనున్నారు.

అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

ఏర్పాట్లను పరిశీలిస్తున్న పిఒ శ్రీవాస్తవ , ఎఎస్‌పి దిలీప్‌కిరణ్

జాతరలో ఆకట్టుకున్న విచిత్ర వేషాధారణలు

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు : డిఆర్‌ఒ

ప్రజాశక్తి - పార్వతీపురం

మార్చి 1 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత సంబంధిత అధికారులను కోరారు. ఇంటర్ పరీక్షల నిర్వహణపై డిఆర్‌ఒ అధ్యక్షతన జిల్లా సమన్వయ కమిటీ సమావేశం ఇంటర్మీడియట్ విద్యా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశమందిరంలో జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని 34 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయని, 5,126 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు చెప్పారు. ప్రతి కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తుతో పాటు 144 సెక్షన్ అమలు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు వచ్చి, తిరిగి వారి ప్రాంతాలకు చేరుకునేలా ఆర్టీసీ బస్సులను నడపాలని, ప్రతి కేంద్రం వద్ద ఎఎన్ఎంలను, మందులతో ప్రథమ చికిత్స శిబిరాలను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కోరారు. తాగునీరు, పారిశుధ్యం ఏర్పాట్లను ప్రతి రోజూ పర్యవేక్షించాలని మున్సిపల్, పంచాయతీ అధికారులను ఆదేశించారు. పరీక్షలు ప్రారంభం నుంచి ముగిసే వరకు కేంద్రాల్లో విద్యుత్ అంతరాయం ఉండరాదని ఎపిఇపి డిసిఎల్ అధికారులను ఆదేశించారు. అధికారులకు అప్పగించిన విధులను అందరూ బాధ్యతతో నిర్వహించి, పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలని ఆమె ఆకాంక్షించారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి డి.మంజులవీణ మాట్లాడుతూ ఫిబ్రవరి 5 నుంచి జిల్లాలో ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్నాయని పేర్కొన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని, జిల్లాలో ఎటువంటి సమస్యాత్మక, సునిసిత కేంద్రాలు లేవని ఆమె అన్నారు. సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ టి.జగన్మోహనరావు, మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసరాజు, ప్రత్యేక అధికారి వై.నాగేశ్వరరావు, సవరాపు రమణ, వి.హరగోపాల్, పి.శంకరరావు, బి.రాజేష్, విద్య, పంచాయతీ, ఎపిఇపిడిసిఎల్, ఆర్టీసీ, తపాలా శాఖలకు చెందిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు చర్యలు : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి - పాచిపెంట

ప్రతి ఒక్కరిలో ముఖ్యంగా గర్భిణీల్లో శత శాతం రక్తహీనత నివారించేందుకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి ఎస్.భాస్కరరావు తెలిపారు. మంగళవారం పాచిపెంట, గురువినాయుడుపేట పిహెచ్‌సిలను ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ముందుగా సంబంధిత రికార్డులు, మందుల నిల్వలను పరిశీలించారు ముఖ్యంగా గర్భిణీల్లో రక్తహీనత లేకుండా ప్రత్యేకమైన చర్యలు చేపడుతున్నామని పిహెచ్‌సిల ఆవరణలో ఆకుకూరలు, కాయకూరలు పండించి గర్భిణీలకు అందజేసేలా చర్యలు చేపడుతున్నామన్నారు. 15 రోజులకు ఒకసారి ఎఎన్ఎం, ఆశా, హెల్త్ సూపర్వైజర్లు గర్భిణీల ఇళ్లకు వెళ్లి తనిఖీలు నిర్వహించి అవసరమైన మందులు అందజేయాలన్నారు. అలాగే డెంగీ, మలేరియా నివారణకు గ్రామాల్లో పిచికారి చేయాలని, సుదూర ప్రాంతాల ప్రజలకు మందులు అందేలా సబ్ సెంటర్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సురేష్, చంద్రదేవ్, గంటా వెంకటరమణ, సిబ్బంది ఉన్నారు.

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని కరాసువలసకు చెందిన దళితులపై దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్వై నాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానికఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దళితులను వారు పరామర్శించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత కొంతకాలంగా కరాసువలస సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిని అదే గ్రామంలో గల పది దళిత సాగు చేస్తున్నాయని చెప్పారు. ఆ భూమికి పక్కనే సాలూరు పట్టణానికి చెందిన క్వారీ యజమాని సుతాపల్లి రాము భూమి ఉండడంతో ఆయన కన్ను పడిందన్నారు. దళితులను భూమి నుండి తప్పించి ఆ భూమిని కాజేయాలనే దురుద్దేశంతో పక్క గ్రామం గుర్రపువలస గిరిజనులను దళితులు చేస్తున్న భూమిపై ఎగదోసి దళితులపై దాడి చేసేలా రాము ఉసిగొల్పారని చెప్పారు. రెండు రోజుల క్రితం దళితులు సాగు చేస్తున్న భూమిలో ఉన్న జీడీ, టేకు మొక్కలను నరికేశారని తెలిపారు. మళ్లీ ఈనెల 27న దళితులు భూమి సాగు చేస్తుండగా గిరిజనులు దాడికి దిగారని, ఇటువంటి దాడులు చేయించడం సరికాదని తెలిపారు. ఈ దాడిలో ఆడ మగ అని తేడా లేకుండా గాయపరిచారని చెప్పారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. రాము క్వారీ చుట్టూ ఉన్న ప్రభుత్వ బంజరు, జిరాయితి భూములను ఆక్రమించేసి పేదల నుంచి లాక్కున్నారని తెలిపారు. కావున రాము భూ అక్రమాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టి చర్యలు తీసుకోవాలని, పేదలకు భూములు పంచాలని డిమాండ్ చేశారు. సాగులో ఉన్న కరాసవలస గ్రామ దళితులకు పట్టాలిచ్చి రక్షణ కల్పించాలని డిమాండ్ కోరారు. దళితులకు, గిరిజనులకు మధ్య తగాదాలు పెట్టడం మానుకోవాలన్నారు. గుర్రపువలస రెవెన్యూ పరిధిలో సర్వేనెంబర్ 77 -2 లో 2.12 సెంట్లు ప్రభుత్వ భూమిని సాలూరు పట్టణానికి చెందిన నాగోలు సన్యాసిరావుకి అక్రమంగా పట్టా ఇచ్చారని, ఈ పట్టాను వెంటనే రద్దు చేయాలని, సాగులో ఉన్న దళితులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దళితులపై దౌర్జన్యం చేసి దాడులు చేయిస్తున్న రామును వెంటనే అరెస్టు చేయాలని కోరారు. భవిష్యత్తులో దళితులపై దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలని, వారికి రక్షణ కల్పించాలని కోరారు. లేనిచో మండలంలోని దళిత, గిరిజన పేదలను సమీకరించి పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సేలంబారికి సింహాచలం, రాము, బోడయ్య అడ్డకట్ల కమలాకర్, చింతాడ నవీన్ , తదితరులు పాల్గొన్నారు.

సాగులో ఉన్న ఎస్‌సిలకు పట్టాలు ఇవ్వాలి

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు

స్పీకర్ వ్యాఖ్యలతో గిరిజన హక్కులకు భంగం

- 1/70 చట్టంపై ప్రభుత్వ వైఖరి ప్రకటించాలి
- గిరిజన సంఘం జిల్లా నాయకులు డిమాండ్

ప్రజాశక్తి - పార్వతీపురం

షెడ్యూల్ ఏరియాలో టూరిజం అభివృద్ధికి 1/70 చట్టం అడ్డుగా ఉందని, ఈ చట్టాన్ని సవరించాలని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రకటించడం ఆయన వ్యక్తి గత అభిప్రాయం మా, టిడిపి విధానమా ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు సీదరపు అప్పారావు, జిల్లా నాయకులు మండంగి రమణ, కె.రామస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం వారు విడుదల చేసిన ఒక ప్రకటనలో మాట్లాడుతూ రాజ్యాంగ బద్ధ పదవిలో ఉన్న అసెంబ్లీ స్పీకర్ గిరిజనుల హక్కులను కాలరాసేలా మాట్లాడడం సరికాదని, ఆయన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. 1/70 చట్టం రక్షణకు సిద్ధం కావాలని కోరారు. ఈనెల 27న విశాఖలో జరిగిన ప్రాంతీయ పెట్టుబడుల సదస్సు (రీజన్ ఇన్వెస్టర్ సబ్మిట్)లో స్పీకర్ మాట్లాడుతూ ఆదివాసీ ప్రాంతంలో టూరిజం అభివృద్ధికి హెూటల్లు, రెస్టారెంట్లు, పార్కులకు పెట్టుబడులు పెట్టాలంటే 1/70 చట్టం సవరణకు రాష్ట్ర ప్రభుత్వం అధికార యంత్రాంగం లోతైన అధ్యయనం చేసి సవరణ చేయాలనడం సరికాదన్నారు. షెడ్యూల్ ప్రాంతంలో బడా పెట్టుబడిదారులకు, కార్పొరేట్ కంపెనీలు ఆదివాసీ సంపదలైన సహజవనరుల, అడవులు, ఖనిజాలు, ప్రకృతి అందాలు స్వాధీనం చేసుకుని వ్యాపారం సాగిస్తాయని, ఆదివాసీల జీవన విధానం ధ్వంసం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. 2000లో టిడిపి విజన్ 2020 పేరుతో 1/70 చట్టాన్ని సవరించి బాక్సైట్ ఖనిజాన్ని దోసుకోవడానికి కుట్ర చేసిందని, నేడు విజన్ 2047 పేరుతో 1/70 చట్టం సవరణకు పూనుకుని టూరిజం అభివృద్ధి పేరుతో పన్నాగం పన్నుతోందని చెప్పారు. 1/70 చట్టం జోలి కోస్తే టిడిపి ప్రభుత్వానికి ఆదివాసీలు సరైన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

సీతంపేట : 1/70 చట్టంపై సడలింపులు ఇవ్వాలని స్పీకర్ సిహెచ్ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలు తక్షణమే వెనుక్కు తీసుకోవాలని ఆదివాసీ జెఎసి అధ్యక్షులు బిడ్డిక శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఐటిడిఎ వద్ద నిరసన తెలిపారు. అనంతనం మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అరుకులో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, పాలకొండలో ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, విద్యాశాఖామంత్రి నారా లోకేష్ జీవో నెంబర్ 3 పునరుద్ధరిస్తామని భరోసా ఇచ్చిన మాటలు నేటికీ ఆదివాసీలకు కలలుగానే మిగిలిపోయాయన్నారు. కానీ ఒక స్పీకర్ స్థాయిలో ఉండి రాజకీయాల్లో అపారమైన అనుభవం ఉండి గిరిజన చట్టాలను కాపాడాల్సింది పోయి కాలరాసే ప్రయత్నం చేయడం యావత్ గిరిజన సమాజం జీర్ణించుకోలేక పోతుంది ఆవేదన వ్యక్తం చేశారు. స్పీకర్ చేసిన వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని, లేని పక్షంలో రాష్ట్రంలోని గిరిజనులంతా ఏకమై ఆందోళనలను ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో జెఎసి కార్యదర్శులు నిమ్మక కాంతరావు, కొండగొర్రి భాస్కరరావు, బిడ్డిక ఉమామహేశ్వరరావు, బిడ్డిక రామ్మోహన్ రావు, టి.తిరుమల రావు, కూరంగి నాగరాజు, గేదెల గిరిబాబు, మండంగి నరేష్ పాల్గొన్నారు.

తంగలాంలో కాఫీ పంట కోసం సర్వే చేస్తున్న అధికారులు

మరణించిన అంగన్వాడీల అంత్యక్రియలకు రూ.15 వేలు

ప్రజాశక్తి - సాలూరు

సర్వీసులో ఉంటూ మరణించిన అంగన్‌వాడీ వర్కరు, సహాయకుల అంత్యక్రియలకు రూ.15 వేలు మంజూరు చేస్తామని రాష్ట్ర మహిళా శిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మంగళవారం సాలూరులో తన క్యాంప్ కార్యాలయంలో వివరిం చారు. మంగళవారం జీఓ ఆర్‌టి నెంబరు 9తో ఉత్తర్వులు జారీ చేశామని వెల్లడించారు. మరణించిన అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు చెందిన చట్టబద్ధమైన వారసులకు ఈ మొత్తం సొమ్మును చెల్లిస్తామన్నారు.

దీక్షలో ఉన్న వారికి నిమ్మరసం ఇస్తున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మధరావు

కాఫీ సాగు విస్తరణకు సర్వే

ప్రజాశక్తి - పాచిపెంట

జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఆధ్వర్యంలో కాఫీ బోర్డు ఐటిడిఎ, శాస్త్రవేత్తల బృందం శతాభి, తంగలాం, గరిసిగుడ్డి పంచాయతీల్లోని పలు గ్రామాల్లో కాఫీ పంట విస్తరణకు సర్వే నిర్వహించారు ఈ సందర్భంగా శతాభి గ్రామంలో రైతుల సమావేశం ఏర్పాటు చేసి కాఫీ పంటకు కావాల్సిన అనుకూల పరిస్థితుల గురించి కాఫీ బోర్డు లైసెన్ ఆఫీసర్ ఎస్.రమేష్ వివరించారు. ఏప్రిల్ నుండి వర్షపాతం నమోదయ్యే ప్రాంతాల్లో కాఫీ బాగా పండుతుందని ఉరుడు పండాలంటే నీడ అవసరమని, దీనికోసం మామిడి, పనస వంటి ఆకు రాల్చని మొక్కలను పెంచుకోవాలని సూచించారు. ఆర్‌సిఆర్ఎస్ శాస్త్రవేత్త డి.సునీల్‌బాబు మాట్లాడుతూ తంగలాంలో రైతులు కొద్ది జాగ్రత్తలు తీసుకుంటే నాణ్యమైన కాఫీ పంట వస్తుందని, కాఫీతో పాటుగా మిరియాలు వంటి అంతర పంటలు వేసుకుంటే ఎకరాకు లక్ష రూపాయల వరకు ఆదాయం వస్తుందని తెలిపారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి బి.శ్యామల మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాలతో కాఫీ పంట విస్తీర్ణం పెంచడం కోసం సంయుక్త సర్వే నిర్వహిస్తున్నామన్నారు. ఈ నివేదిక కలెక్టర్‌కు పంపాక విస్తీర్ణం, దిగుబడి పెంపుదలకు శిక్షణ నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా రైతులు తమకు త్వరగా పెరిగే సిల్వర్ ఓక్ చెట్లు కావాలని, అలాగే కాఫీ గింజలు వేరు చేసే యంత్రాలు కావాలని కోరారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీనివాసరాజు, ఐటిడిఎ పిఎఒ శ్రీనివాస రావు, ఉద్యాన శాఖ అధికారి ఝాన్సీ, వ్యవసాయ శాఖ ప్రకృతి వ్యవసాయ ఎల్-1 సురేష్, రైతులు పాల్గొన్నారు.

ఎపిఎస్‌ఎస్‌డిసి ద్వారా నైపుణ్య కార్యక్రమాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారికంగా రెండు నైపుణ్య కార్యక్రమాలను ప్రారంభించినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎపిఎస్‌ఎస్‌డిసి డిజిటల్ భవిష్యత్తు కోసం అవసరమైన నైపుణ్యాలతో విద్యార్థులు, వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు సాధికారత కల్పించేందుకు NASSCOM Future Skills Prime సహకారంతో అధికారికంగా రెండు సంచలనాత్మక కార్యక్రమాలను ప్రారంభించిందన్నారు. అందులో ఆర్టిఫీసియల్ ఇంటలిజెన్స్ (ఎఐ) అసెండ్ ప్రోగ్రామ్ ఒకటని అన్నారు. ఫ్యూచర్ ఇన్నోవేటర్‌లకు సాధికారత గ్రాడ్యుయేట్లు, ఇంజనీరింగ్ విద్యార్థులు (II & III ఇయర్) పని చేసే నిపుణులను లక్ష్యంగా చేసుకుని, ఈ ప్రోగ్రామ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇతర అధునాతన సాంకేతికతలపై లోతైన అభ్యాసాన్ని అందిస్తుందని తెలిపారు. ఆసక్తి గల వారు ఈ ప్రోగ్రామ్ కొరకు ఈ నెల 30వ తేదీలోగా తమ వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. అలాగే రెండో ప్రోగ్రాం డిజిటల్ 101 అని అన్నారు. అన్‌లాక్ ది ఫ్యూచర్ ఏడాది ఇంజినీరింగ్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటిఐ విద్యార్థుల కోసం రూపొందించబడిందన్నారు. దీనికొరకు ఆసక్తి గలవారు ఫిబ్రవరి 5 నుంచి 12లోగా నమోదు చేసుకోవాలన్నారు. ఈ రెండు ప్రోగ్రామ్‌లు ఎన్ఎఎస్ఎస్‌సిఒఎం సహకారంతో ఉచిత కోర్సు పూర్తి, ధ్రువపత్రాలను అందిస్తాయని, నేటి జాబ్ మార్కెట్‌లో పాల్గొనే వారికి పోటీతత్వాన్ని అందించనున్నట్లు చెప్పారు. రిజిస్ట్రేషన్ కొరకు http://engineering.apssdc.in రిజిస్టర్ లింకును ఓపెన్ చేయాలని అన్నారు. మరింత సమాచారం కోసం 99888 53335, 7036388297 నెంబర్లను సంప్రదించాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

విఒఎల దీక్షలు విరమణ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట మూడు రోజుల సామూహిక దీక్ష చేస్తున్న విఒఎలు మంగళవారం రాష్ట్ర సర్ప్ సిఇఒ ఇచ్చిన హామీ మేరకు తమ దీక్షను విరమించారు. ఈ మేరకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు నిమ్మరసం అందజేసి దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 4న సర్ప్ సిఇఒ చర్చలకు రమ్మన్నారని అందుకే దీక్షలు విరమిస్తున్నట్టు తెలిపారు. స్థానిక కలెక్టరేట్ వద్ద విఒఎల సంఘ నాయకులు కె.ధర్మరాజు అధ్యక్షతన ఈనెల 27, 28, 29 తేదీల్లో విఒఎల సమస్యల పరిష్కరించాలని, కాల పరిమితి జిఒ రద్దు చేయాలని విఒఎల అకౌంట్‌లోనే గౌరవ వేతనం వేయాలని, సిమ్ సెల్ ఫోన్లు కనీస వేతనాలు రాజకీయ ఒత్తులు తొలగించిన వారిని విధులు చేర్చుకోవాలని, ఉద్యోగ భద్రత కోసం రాష్ట్రవ్యాప్తంగా విఒఎల సామూహిక దీక్షలకు పిలుపు ఇచ్చారు. అయితే రెండో రోజు దీక్ష కొనసాగుతూ రాష్ట్ర కేంద్రం నుంచి సెర్ప్ సిఇఒ ఫిబ్రవరి 4న ఉమ్మడి మీటింగ్ పెట్టి చర్చలకు ఆహ్వానించారన్నారు. ఈ చర్చల్లో విఒఎల సమస్య పరిష్కారం చేయాలని, లేని పక్షంలో ఉద్యమ బాట తప్పదని నాయకులు అన్నారు. దీక్షలకు సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు, సిఐటియు జిల్లా అధ్యక్షులు ధావాల రమణారావు, నాయకులు కొల్లి సాంబమూర్తి, ప్రజానాట్యమండలి నాయకులు కోరాడ ఈశ్వరరావు మద్దతు తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో శ్రామిక మహిళా సంఘం నాయకులు వి.ఇందిర, తవుడు, సంతు, రవి, బుజ్జి, శ్రీదేవి, విఒఎలు పాల్గొన్నారు.

రహదారి పనులు చేపట్టాలి

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని మర్రిపాడు పంచాయతీ రంగవలస గిరిజన గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని గిరిజన సంఘం నాయకులు ఎం.తిరుపతిరావు, ఎం.లక్ష్మణరావు, బి.సాయికుమార్ డిమాండ్ చేశారు. ఈ రోడ్డును ప్రారంభించి నాలుగేళ్లు కావస్తున్నా నేటికీ పూర్తికాకపోవడం దారుణమన్నారు. రోడ్డు సౌకర్యం లేకపోవడంతో గిరిజనులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ రోడ్డు పరిస్థితిపై అనేకమార్లు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా ఎటువంటి స్పందన లేదని, ఇదేనా పాలకులకు, అధికారులకు గిరిజనుల అభివృద్ధిపై ఉన్న చిత్తశుద్ధి అని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే రోడ్డు పనులు ప్రారంభించాలని, లేకుంటే పెద్దఎత్తున ఐటిడిఎ వద్ద నిరాహారదీక్షలు చేస్తామని హెచ్చరించారు.

మండల అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

సమస్యలు వెంటనే పరిష్కరించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సీతంపేట

గ్రామాల్లో తాగునీరు, రహదారులు వంటి సమస్యలు వెంటనే పరిష్కరించాలని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆయన అధికారితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. పిఎం జన్మాన్‌లో మంజూరైన ఇళ్లను త్వరితగతి పూర్తి చేయాలని సూచించారు. సిసి రోడ్లు వెంటనే నిర్మించాలన్నారు. అనంతరం కార్యాలయ ప్రాంగణంలో మొక్క నాటారు. కార్యక్రమంలో తహశీల్దార్ అప్పలరాజు, ఎంపిడిఒ గీతాంజలి, కూటమి నాయకులు హెచ్ ప్రసాదరావు, మాజీ ఎంపిపి మాలయ్య, హౌసింగ్ ఎఇ వెంకటేష్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ సత్యం, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

పథకాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని మల్లుగూడలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కురుపాం వ్యవసాయ శాఖ ఎడిఎ ఎ.నిర్మల జ్యోతి రైతుల ను ఉద్దేశించి మాట్లాడారు. రైతులు ఆర్థికంగా నిలదొక్కకున్నందుకు ప్రభుత్వం సబ్సిడీతో నూర్పిడి యంత్రాలు, పిండి మిల్లులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నూర్పిడి యంత్రం ఎస్సీ, ఎస్టీ రైతులకు లక్ష రూపాయలు సబ్సిడీ, పిండిమిల్లుకు రూ.15వేలు సబ్సిడీ ఉందన్నారు. అలాగా ప్రధానమంత్రి కిసాన్ అర్హత కలిగిన రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రైతులు ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడీ పథకాలను సక్రమంగా వినియోగించుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సిహెచ్. ప్రసాద్, వ్యవసాయ శాఖ సహాయకులు బి.దినేష్, రైతులు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి సన్మానం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

లలితను అభినందిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు

మండలంలోని మారుమూల గిరిజన గ్రామం గుల్లలంకకు కిల్లక లలిత సూపర్ పవర్ చైనాలో కల హ్యాంగ్లో నగరంలో 2023-24 లో జరిగిన (పారా) వికలాంగుల ఆసియన్ పారా అథ్లెటిక్స్ క్రీడాపోటీల్లో సత్తా చాటింది. 1500 మీటర్ల పరుగు పందెంలో సిల్వర్ మెడల్, అలాగే వరల్డ్ పారా అథ్లెటిక్స్ బెంగుళూరు ఇండియాలో జరిగిన పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించారు. 2024 లో మొరోకోలోని మార్రాకెన్ నగరంలో కూడా ఐదో స్థానం సాధించారు. వీటితో పాటుగా జాతీయ స్థాయి పోటీల్లో సుమారుగా 10కి పైన వివిధ క్రీడాంశాలల్లో పథకాలు సొంతం చేసుకున్నారు. క్రీడాకారిణి ప్రతిభ పట్ల పాలకొండ డివిజన్‌లో వ్యాయామ ఉపాధ్యాయులు లలితను సన్మానించారు.

మలేరియా పట్ల నిత్యం పర్యవేక్షణ

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మలేరియా పాజిటివ్ కేసులకు చికిత్సానంతర పర్యవేక్షణ అత్యవసరమని జిల్లా సహాయ మలేరియాధికారి సూర్యానారాయణ అన్నారు. మంగళవారం డోకిశీల పిహెచ్‌సిలోని ములక్కాయవలసలో మలేరియా పాజిటివ్ కేసును సందర్శించి స్థానిక సబ్ యూనిట్ అధికారి ధనుంజయకుమార్‌కు తగు సూచనలు ఇచ్చారు. ఆ గ్రామంలో తక్షణమే ఫోకల్ స్ప్రేయింగ్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆశాలు, సామజిక ఆరోగ్య కార్యకర్తల ద్వారా సంపూర్ణ చికిత్స అందేలా చూడాలని, ఆరోగ్య పర్యవేక్షకులు కృష్ణారెడ్డికి సూచించారు. అనంతరం పి హెచ్‌సిని సందర్శించి వైద్యాధికారి ఐశ్వర్య ద్వారా జ్వరాల స్థితి గతులను అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్‌లోని రికార్డులు తనిఖీ చేశారు. ప్రతి జ్వర కేసుకు తప్పక మలేరియా, డెంగీ పరీక్ష చేయాలని ఎల్‌టి ఆదిలక్ష్మికి సూచించారు.

సర్వే వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని ఎమ్మెస్‌ఎంఇ సర్వేను వేగవంతం చేయాలని ఎంపిడిఒ బి.వెంకటరమణ ఇంజినీరింగ్ సహాయకులను ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ సహాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. త్వరితగతిన సర్వే పూర్తి చేసేందుకు బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో. ఎంఎస్ఎంఇ కోఆర్డినేటర్ అశోక కుమార్, ఇంజనీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

డైరీని ఆవిష్కరించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వీరఘట్టం

ఎస్సి, ఎస్టి టిఎఫ్ ఎపి రాష్ట్ర సంఘం డైరీ, క్యాలెండర్లను మంగళవారం ఎమ్మెల్యే స్వగ్రామమైన ఎం.రాజపురం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆవిష్కరించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఎస్సీ, ఎస్టీ టిఎఫ్ జిల్లా అధ్యక్షులు అన్ను వెంకట్రావు, గౌరవ అధ్యక్షులు దూసి శ్రీబాబు, ప్రధాన కార్యదర్శులు ఆంపోలు సూర్యానారాయణ, నాయకులు అన్ను ప్రసాదు, గుణాల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యేకు అంబేద్కర్ చిత్రపటాన్ని బహుకరించి శాలువాతో సత్కరించారు.

30న మరియ గిరియాత్ర

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలం యు.వెంకంపేట పంచాయతీ పరిధిలో గల మరియగిరి కొండ వద్ద యాత్ర నిర్వహించనున్నట్లు ఫాదర్ విజయరెడ్డి మంగళవారం తెలిపారు. ఈ యాత్రకు వీరఘట్ట మండలంతో పాటు పాలకొండ, గరుగుబిల్లి, జిఎం వలస, వంగర, రాజాం, శ్రీకాకుళం, సీతంపేట, భామిని, తదితర మండలాల నుండి అధిక సంఖ్యలో యాత్రికులు వస్తారన్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు భారీ పోలీసు బందోబస్తు కూడా ఏర్పాటు చేయనున్నారు. ప్రతి రోజూ సాయంత్రం ఆలయం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మరియగిరి కొండ విద్యుత్తు అలంకరణలతో దర్శనమిస్తుంది.

యుటిఎఫ్ నాయకుడికి ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - వీరఘట్టం

యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఆరిక భాస్కరరావు తల్లి ఆరిక సూరమ్మ ఇటీవల వలగెడ్డ గ్రామంలో మృతి చెందడంతో పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయనుకు అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పరామర్శించిన వారిలో కూటమి నాయకులు హెచ్ ప్రసాదరావు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కె కృష్ణారావు, విశ్రాంతి ప్రధానోపాధ్యాయులు కొండ గొర్రె సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

డిఇఒ కార్యాలయ ఇబ్బందికి వినతిని అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు, ప్రజాసంఘాల నాయకులు

రాజకీయ కుట్రతో తొలగించడం అన్యాయం

మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణంలోని కొత్తవలస పురపాలక ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం నిర్వాహకులుగా గత మూడేళ్లుగా కొనసాగుతున్న కార్మికులను అక్రమంగా తొలగించి వారికి అనుకూలమైన వారిని నియమించడం అన్యాయమని మధ్యాహ్న భోజనం నిర్వాహకుల సంఘం (సిఐటియు అనుబంధం) నాయకులు వి.ఇందిర, గొర్లి వెంకటరమణ అన్నారు. మంగళవారం స్థానిక డిఇఒకి నిర్వాహకులతో కలిసి సిఐటియు నాయకులు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నియమించిన కార్మికుల పట్ల నేటి రాజకీయ నాయకులు వ్యవహరిస్తున్న తీరు సరైంది కాదని వాపోయారు. ఎటువంటి కారణం లేకుండా కార్మికులను తొలగించాలని ప్రజా ప్రతినిధులతో సహా జిల్లా విద్యాశాఖ అధికారులు మొండిగా వ్యవహరించడం అన్యాయమని అన్నారు. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు కూడా పాత వారినే కొనసాగించాలని గత తల్లిదండ్రుల కమిటీ సమావేశంలో నిర్ణయించుకున్నట్లు తెలిపారని అయినా ఆ వార్డుతో సంబంధంలేని రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు ప్రధానోపాధ్యాయుడ్ని ఒత్తిడికి గురి చేయడం సరైనదికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కావున ఇకనైనా ప్రభుత్వ ఉద్యోగస్తులు, కార్మికులపై రాజకీయ జోక్యం మానుకోవాలని, విద్యార్థులు, తల్లిదండ్రుల నిర్ణయం మేరకు పాతవాలనే మధ్యాహ్నం భోజనం నిర్వాహకులుగా కొనసాగింపు చేయాలని డిమాండ్ చేశారు. లేని యెడల పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పాఠశాల మధ్యాహ్న భోజన కార్మికులు కొండేటి రాధ, రెడ్డి హేమ, అగ్గాల స్వాతి, బొండపల్లి ముత్యాలమ్మ, ఐల్ల జ్యోతి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి.గంగునాయుడు, సిఐటియు నాయకులు దావాలా రమణారావు, కొల్లి సాంబమూర్తి, బంకురు సూరిబాబు, పి.రాజశేఖర్ మద్దతు తెలిపారు.

నివేదికను వివరిస్తున్న సోషల్ అడిట్ సభ్యులు

మస్తరు షీట్లలో తప్పలుండరాదు : పీడీ

ప్రజాశక్తి - భామిని

ఉపాధి పనులు చేపట్టే సమయంలో కూలీలకు వేస్తే మస్తర్ల షీట్లలో తప్పులు ఉండరాదని డ్వామా పీడీ కె.రామచంద్రరావు సిబ్బందికి సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపిడిఒ సత్యం ఆధ్వర్యాన ఉపాధి హామీ చట్టం 2023 -24 మండల స్థాయి సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. 2023 -24లో ఉపాధిహామీ, పంచాయతీరాజ్, ఐటీడీఏ భాగాల్లో 1589 పనులకు సంబంధించి తనిఖీ నిర్వహించారు. రోజు వారి కూలీలు పరంగా రూ.16,35,79,877, మెటీరియల్ పనుల నిమిత్తం రూ.2,89,15,599 చెలించినట్లు తెలిపారు. ఈ పనులపై నిర్వహించిన తనిఖీలో మస్టర్ సీట్లు నమోదులో తప్పులు, తప్పుడు సంతకాలు గుర్తించినట్లు, బ్లాక్ ప్లాంటేషన్ పూర్తి స్థాయిలో నాటిన మొక్కలు ఎక్కడా కనిపించడం లేదని తనిఖీ బృందం తెలిపింది. తప్పుడు మస్టర్ సీట్లు, వేతనాలపై, బ్లాక్ ప్లాంటేషన్ రికవరీ చేయాలని పీడీ రామచంద్రరావు ఆదేశించారు. మస్టర్ సీట్లు తప్పుడు సంతకాలు ఎందుకు వస్తున్నాయని, బ్లాక్ ప్లాంటేషన్ పనుల్లో ఎందుకు నిర్లక్ష్యం వ్యవహరించారని ప్రశ్నించారు. కొత్తగా మెట్ల నియామకంలో నిబంధనలు అనుసరించి వేతనదారులు ఇష్ట ప్రకారమే నియమించాలని ఎంపిపి ప్రతినిధి తోట సింహాచలం పీడీని కోరారు. కొరమ క్షేత్ర సహాయకుడు క్షేత్ర స్థాయిలో లేకుండా పనులు నిర్వహిస్తున్నారని ఆ గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఎపిడి శ్రీహరి, ఎపిఒ, తులసీదాస్, వైస్ ఎంపిపి మజ్జి మోహన్‌బాబు, ఉపాధిహామీ సిబ్బంది, సామాజిక తనిఖీ బృందం సభ్యులు ఉన్నారు.

ప్రతి పంచాయతీకి మోడల్ ప్రైమరీ స్కూల్ మంజూరు చేయాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్రతి పంచాయతీకి ఒక మోడల్ ప్రైమరీ పాఠశాల మంజూరు చేయాలని, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, రాష్ట్ర కౌన్సిలర్ ఎస్.రాజకుమారి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోనంగి దుర్గాప్రసాద్, కురమాన గోవిందరావు మంగళవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. జీవో 117 ప్రత్యామ్నాయం లో భాగంగా మండలంలోని ప్రాథమిక పాఠశాలలుగా దశమంతపురం, నడుకూరు, ఎంవి పురం, హుస్సేన్ పురం, పివిఆర్ పురం, గడగమ్మ, కిమ్మి, చిదిమి, తూడి మారబోతు న్నాయని, వీటిని యుపి పాఠశాలలుగా యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలల మార్పు చేయడం వల్ల డ్రాపౌట్ పెరిగే అవకాశం ఉందని, ప్రతి పంచాయతీకి ఒక మోడల్ ప్రైమరీ పాఠశాల ఉండేలా ప్రతిపాదనలు చేసి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని వారు డిమాండ్ చేశారు.

అంబులెన్స్ సౌకర్యం కల్పించాలి : సిఐటియు

ప్రజాశక్తి - కొమరాడ

గిరిజనులకు తక్షణమే ఆరోగ్య సౌకర్యం కల్పించేందుకు పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎల ద్వారా అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. విశాఖ కెజిహెచ్ హాస్పిటల్ వద్ద గిరిజనుల కోసం మెరుగైన వైద్యమందించేలా ప్రారంభించిన ట్రైబల్ సెల్‌లో మౌలిక వసతుల్లేక అక్కడ పనిచేస్తున్న సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.. అలాగే సీతంపేట ఐటిడిఎ నుంచి అంబులెన్స్ సౌకర్యం కెజిహెచ్ వద్ద కల్పించి గిరిజనులకు అన్నిలా భరోసా కల్పించి ఆదుకోవాలని కోరారు.

పాడి అభివృద్ధికి వైద్యశిబిరాలు దోహదం

ప్రజాశక్తి - సీతానగరం

జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సీతానగరం పశు వైద్యశాలలో ఉచిత గర్భ కోసం వ్యాధుల చికిత్స శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సహాయ సంచాలకులు డాక్టర్ సిహెచ్.దీనకుమార్ ప్రారంభించారు.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పెదభోగిలి సర్పంచ్ జొన్నాడ తేరేజమ్మ, ఉపసర్పంచ్ కంకణాల అరవింద్, మాజీ సర్పంచి బూడితి శ్రీనివాసరావు, సబ్బాన శ్రీనివాసరావు, ఇజ్జాడ రాంబాబు పాడి రైతులు పాల్గొన్నారు. పశు వైద్యాధికారి డాక్టర్ చక్రధర్ పశువైద్యులు 92 పశువులకు గర్భకోస వ్యాధి చికిత్సను అందించినారు. 50 లేగ దూడలకు నులిపురుగులు నివారణ మందులను అందించినారు. ఈ పశు వైద్య శిబిరానికి సీతానగరం పశు వైద్య పారా సిబ్బంది సచివాలయ పశు వైద్య సహాయకులు గోపాలమిత్రులు హాజరైనారు.

కురుపాం : మండలంలోని గుజ్జువాయి పంచాయితీ మర్రిమానుగూడలో వెటర్నరీ వైద్యాధికారి కె. శైలజ పశు ఆరోగ్య వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా దూడలకు, గొర్రెలు మేకలకు నట్టల నివారణ, గర్భకోస చికిత్స, చూడి పరీక్షలు చేసి అవసరమైన వాటికి ఇంజక్షన్లు వేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ హెచ్.నాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, పాడి రైతులు, వెటర్నరీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భామిని : మండల పశుసంర్థకశాఖ అసిస్టెంట్ సర్జన్ మడక సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో భామిని పశుఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు అందించే వైద్య సేవలు, పెంపకం, రక్షణపై పాడి రైతులకు అవగాహన కలిగించారు. సర్పంచ్ లోపింటి రాజేష్ పశు ఆరోగ్య శిబిరం కరపత్రాలు రైతులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి బిడ్డిక ప్రసాద్, టిడిపి నాయకులు కోళ్ల మధు, గురిబిల్లి లక్ష్మీపతి, రైతులు పాల్గొన్నారు.

నిర్మాణాలు వేగవంతం చేయాలి

వీరఘట్టం: పిఎం జన్మన్ పథకం కింద చేపడుతున్న గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని, ఎంపిడిఒ బి.వెంకటరమణ లబ్ధిదారులకు సూచించారు. మంగళవారం మండలంలోని కె.ఇచ్చాపురం పంచాయతీ గంగంపేటలో చేపడుతున్న గృహ నిర్మాణ పనులు పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని, లబ్ధిదారులకు ఆదేశించారు. ఆయనతో పాటు గృహ నిర్మాణ శాఖ, ఎఇ వినోద్ కుమార్, సచివాలయ కార్యదర్శులు వసంత్ కుమార్, శరత్ బాబు, రాంబాబు, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

కిశోర బాలికల్లో రక్తహీనత నివారణ, ఆరోగ్యం మెరుగుకై కృషి చేయాలని వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన వైద్య బృందంతో కలిసి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఆరోగ్య- అవగాహన సదస్సు నిర్వహించారు. త్వరలో ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులు ఆరోగ్య రీత్యా ఇబ్బందులు పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు రక్తహీనతకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని, రక్తహీనత వల్ల అలసట, ఏకాగ్రత కోల్పోవడం తద్వారా చదువు పై ప్రభావం చూపుతుందన్నారు. శరీరానికి తగు పోషకాలు అందించే ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవాలన్నారు. సాధ్యమైనంత వరకు నూనె, కొవ్వు శాతం ఉన్న ఆహారం, ఫాస్ట్ ఫుడ్స్ కు దూరంగా ఉండాలని సూచించారు. బాలికలు ప్రతి రోజూ ఐరన్ మాత్రలు క్రమం తప్పకుండా వేసుకోవాలన్నారు. రుతుక్రమం సమస్యలు ఉంటే వెంటనే వైద్య సిబ్బంది తెలియ జేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రవిచంద్ర, ప్రిన్సిపల్ జె.రామారావు, అధ్యాపకులు శ్రీనివాసరావు, ఆరోగ్య కార్యాలయ డెమో యోగీశ్వరరెడ్డి, ఎపిడెమిక్ ఇఒ సత్తిబాబు, సూపర్వైజర్ పుష్ప, వైద్య సిబ్బంది నారాయణమ్మ పాల్గొన్నారు.

ఇఎంఆర్‌ఎస్‌ను సందర్శించిన పిఒ

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని అనసభద్రలో గల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌ను ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ మంగళవారం సందర్శించారు. పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించిన ఆయన అక్కడ విద్యార్థుల కోసం వండిన ఆహార పదార్థాలను, నాణ్యతను తనిఖీ చేశారు. విద్యార్థులకు ఎటువంటి లోటుపాట్లు ఉండరాదని, నాణ్యమైన ఆహారంతో పాటు విద్యా ప్రమాణాలు బాగుండేలా చూడాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ పర్యటనలో విద్యా శాఖ అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ పనుల పరిశీలన

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎలో ట్రైబల్ వెల్ఫేర్, ఉపాధిహామీ చట్టం కింద చేపట్టిన ఇంజినీరింగ్ పనులను విజిలెన్స్ ఎస్పి బి.ప్రసాదరావు పరిశీలించారు. మండలంలోని 2022లో కడగండి పంచాయతీ నారాయణగూడ - లోకొత్తవలస ఉపాధి హామీ పథకంలో రూ.1.80 లక్షలతో 2.5 కిలోమీటర్లు రహదారి నిర్మించారు. ఆ పనుల నాణ్యత ప్రమాణాలను ఎస్పి పరిశీలించారు. అదేవిధంగా 2020లో ఉపాధి హామీ పథకంలో రూ.1.20 లక్షలతో వలగజ్జి సెంటర్ నుంచి ఎగువ వలగజ్జి వరకు చేపట్టిన రహదారిని విజిలెన్స్ డిఇ సత్యనారాయణ పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలు ఏ మేరకు ఉన్నాయో పరిశీలించారు. నివేదిక ఉన్నత అధికారులకు సమర్పిస్తామన్నారు. ఆయన వెంట ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి రమాదేవి, డిఇ సింహాచలం, ఎఇ కె.నాగభూషణం తదితరులు ఉన్నారు.

భారత్ గ్యాస్ కార్యాలయంలో తనిఖీలు

సక్రమంగా లేని రికార్డులు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక భారత్ గ్యాస్ కార్యాలయాన్ని జిల్లా పౌరసరఫరాల అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యాలయంలో రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడం, పరిసరాలు అస్తవ్యస్తంగా ఉండడం చూసి తనిఖీకి వెళ్లిన అధికారులు ఆశ్చర్యానికి గురయ్యారు. 'ప్రజాశక్తి'లో సోమవారం ప్రచురితమైన 'భారత్ గ్యాస్ వినియోగదారుల ఇక్కట్లు' అన్న వార్తకు జిల్లా యంత్రాంగం స్పందించింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డిఎస్‌ఒ కార్యాలయానికి చెందిన సూపరింటెండెంట్ నరేష్‌కుమార్ తన సిబ్బందితో పట్టణంలోని సారికివీధిలో గల భారత్ గ్యాస్ కార్యాలయంలో ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. భారత్ గ్యాస్ కార్యాలయాన్ని అధికారులు సందర్శించినప్పుడు అక్కడ అస్తవ్యస్త పరిస్థితులను పరిశీలించారు. ఒక్క రికార్డు కూడా పూర్తిస్థాయిలో లేకపోవడం, స్టాఫ్ రిజిస్టర్ నిర్వహణ సక్రమంగా లేకపోవడం, గ్యాస్ ఏజెన్సీకి అనుమతులు ఎవరు పొందారు, ప్రస్తుతం ఎవరు నిర్వహిస్తున్నారు అన్నది పొంతన లేదు. ప్రధానంగా గ్యాస్ సిలిండర్లకు సంబంధించి స్టాక్ ఎంత మేర ఉంది, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన దీపం పథకం ద్వారా ఎంత మంది లబ్ధిదారులకు సిలిండర్లు అందించారన్న దానిపై పూర్తి వివరాలు అధికారులకు లభించకపోవడంతో చేసేదేమీ లేక ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. స్థానికంగా ఉన్న భారత్ గ్యాస్ ఏజెన్సీ సభ్యులు అధికారులకు పొంతన లేని సమాధానం చెప్పడం ఫోన్లో కార్యక్రమం నిర్వహించుకోమని సూచించడం, అవసరమైతే రాజకీయ నాయకులతో మాట్లాడుకుంటామని డిఎస్‌ఒ కార్యాలయ అధికారులకు కొందరు వ్యక్తులు అనడంతో అసలు ఏం జరుగుతుందోనన్నది అధికారులకు తోచలేదు. ఒక దశలో ఉన్న పత్రాలు స్వాధీనం చేసుకొని తమ వెంట తీసుకుంటామని, ఉన్నతాధికారులకు వచ్చి పూర్తి వివరాలు, పత్రాలు సమర్పించాలని సూచించారు. పూర్తి వివరాలు, లీజు అగ్రిమెంటు అనుమతులు ఉంటే డిఎస్‌ఒ కార్యాలయానికి రావాలని సూపరింటెండెంట్ తెలిపారు.

రికార్డులను పరిశీలిస్తున్న పౌరసరఫరా అధికారులు

కొటియా పోలీసుల దుశ్చర్య

అంగన్వాడీ కేంద్రంలో వస్తువులను లాక్కెళ్ళిన వైనం

ప్రజాశక్తి - సాలూరు

ఆంధ్రా- ఒడిశా వివాదాస్పద గ్రామాల్లో ఒడిశా పోలీసులు మళ్లీ దురాగతానికి పాల్పడ్డారు. గంజాయిభద్ర పంచాయతీ దిగువ శెంబిలో ఉన్న ఆంధ్రాకు చెందిన అంగన్వాడీ కేంద్రం నుంచి పుస్తకాలు, ఆటవస్తువులను దౌర్జన్యంగా లాక్కెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. సోమవారం సాయంత్రం అంగన్వాడీ కేంద్రం నుంచి కొంతమంది ఒడిశా అధికారులతో పాటు కొటియా పోలీసులు వచ్చి ఆటవస్తువులను, పుస్తకాలను తీసుకెళ్లారు. కొటియా పోలీసుల దౌర్జన్యాన్ని గ్రామస్తులు ప్రశ్నించలేక మౌనం వహించారు. గత కొంతకాలంగా వివాదాస్పద కొటియా గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొంది. అటు ఒడిశా, ఇటు ఎపి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్న సమయంలో కొటియా పోలీసులు, అధికారులు ఇలాంటి దుశ్చర్యకు పాల్పడం చర్చనీయాంశమవుతోంది. గతంలో గంజాయిభద్రలో నిర్మాణంలో ఉన్న అంగన్వాడీ కేంద్ర భవనాన్ని ధ్వంసం చేశారు. ఎపికి చెందిన ఉద్యోగులు, అధికారులను కొటియా గ్రామాల్లోకి రానీయకుండా అడ్డుకున్నారు. తాజా సంఘటనపై ఐసిడిఎస్ పిఒ విజయలక్ష్మిని వివరణ కోరగా, తనకూ సూపర్ వైజర్ ద్వారా ఆ సమాచారం తెలిసిందని, విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు

ఆటో కార్మికులకు అవగాహన కల్పిస్తున్న ఎంవిఐ వేణుగోపాల్

రోడ్డు భద్రతపై ఆటో డ్రైవర్లకు అవగాహన

ప్రజాశక్తి - పాలకొండ

జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా స్థానిక ఇంధన శకటాల కార్యాలయ ఆవరణలో మంగళవారం ఆటో ఆపరేటర్లకు అవగాహన సదస్సును మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ టి.వేణుగోపాల్, అసిస్టెంట్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఆటో డ్రైవర్ అప్రమత్తంగా ఆటోలను నడపాలని, ఎక్కువమంది ప్రయాణికులను ఎక్కించుకొని అతివేగంగా డ్రైవింగ్ చేయడం నేరమని హెచ్చరించారు. ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చేలా డ్రైవింగ్ చేయాలని సూచించారు. సరైన ధ్రువపత్రాలు కలిగి ఉండాలని, ప్రతి ఆటో డ్రైవర్‌కు లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ఏ డ్రైవర్ అయినా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని, లైసెన్సులు కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లుతో పాటు ఇతర వాహనాల ఆపరేటర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిపై యాసిడ్ దాడి దురదృష్టకరం

ప్రజాశక్తి - సాలూరు

దళిత విద్యార్థిపై మరో విద్యార్థి యాసిడ్ లాంటి ద్రావణంతో దాడి చేయడం దురదృష్టకరమని మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర అన్నారు. పిఎన్ బొడ్డువలస సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 8 తరగతి చదువుతున్న విద్యార్థి చింతగడ చైతన్యపై బాత్ రూమ్ క్లీనింగ్ చేసే ద్రావణంతో దాడి చేయడం పాఠశాల యాజమాన్య నిర్లక్ష్యమేనని చెప్పారు. తమ పిల్లలకు బంగారు భవిష్యత్తు గురించి కలలు కన్న నిరుపేద తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో గిరిజన, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో, ఆశ్రమ పాఠశాలల్లో చేరుస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో ఇటీవల కాలంలో ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని, పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని రాజన్నదొర కోరారు.

రెండు ఇసుక లారీలు పట్టివేత

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక ఆర్డీవో కార్యాలయం దగ్గర రెండు ఇసుక లారీలను సబ్ కలెక్టర్ యశ్వంత్ రెడ్డి మంగళవారం పట్టుకున్నారు. సీతంపేట నుంచి పాలకొండ సబ్‌కలెక్టర్ కార్యాలయానికి వస్తున్న ఆయన ఇసుక లారీలను చూసి సిబ్బందిని కార్యాలయం నుంచి పంపించి ఆ వాహనాలను అదుపులోకి తీసుకున్నారు. తహశీల్దార్ పి.బాలమురళీకష్ణ అక్కడ చేరుకొని వారి పత్రాలను పరిశీలించారు. కొత్తూరు నుంచి వేరే ప్రాంతానికి ఇసుక వెళ్తున్నట్లు గుర్తించారు.

వీరఘట్టంలో దట్టమైన పొగ మంచు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని మంగళవారం ఉదయం దట్టమైన పొగమంచు కురిసింది. ఉదయం 6 గంటల నుంచి ఏడున్నర గంటల వరకు మంచు అలా ఉండడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటి ప్రభావం వల్ల జీడి, మామిడి పంట పూత రాలే అవకాశం ఉందని, పంటకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రాణాలు కాపాడండి

పార్వతీపురంటౌన్ : ప్రమాదవశాత్తూ రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులకు తక్షణ సాయం అందించి ప్రాణాలు కాపాడాలని జిల్లా రవాణాశాఖాదికారి టి.దుర్గాప్రసాద్ రెడ్డి అన్నారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, ప్రైవేట్ ఆసుపత్రులు, జన కూడలి ప్రదేశాల్లో గుడ్ సామారిటన్ (తక్షణ సహాయం అందించే దయార్థ హదయులు) పోస్టర్లను అతికించి గోల్డెన్ అవర్‌లపై అవగాహనా కల్పించారు. గాయపడిన వారి పట్ల కరుణ, సాయం చేసే మానవత్వం ఉండాలని తెలిపారు. క్షతగాత్రులకు సాయం చేసిన వారికీ ప్రభుత్వం రూ.5వేలు ప్రోత్సాహక బహుమతి ఇస్తుందన్నారు. వివిధ ప్రాంతాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఎం.శశికుమార్, జి.సత్యనారాయణ, ఎన్.రమేష్ కుమార్, బి.కాశీరాం నాయక్, ఎ.వరప్రసాద్, (ఎం.వి.ఐ), రవాణా శాఖ, అగ్నిమాపక శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు

పార్వతీపురం రూరల్ : మండలంలోని వెంకంపేట పంచాయతీ పరిధిలోని అధికారుల కాలనీకి ఆనుకొని ఉన్న వెంకమ్మచెరువు వాలు గెడ్డను గుర్తు తెలియని కొందరు ఆక్రమణలకు పాల్పడిన సంఘటనలు మంగళవారం తహశీల్దార్ విజయలక్ష్మి స్థల పరిశీలన చేశారు. స్థానిక వీఆర్వో ఆచారితో కలిసి ఆక్రమణలను పరిశీలించారు. దీనికి పాల్పడుతున్న వారిని పిలిచి ఈ స్థలంపై హక్కులు ఉన్నట్లయితే తహశీల్దార్ కార్యాలయంలో ఆధారాలు చూపించి సర్వే చేయించుకోవాలని, అనుమతుల్లేకుండా చెరువులు, గెడ్డలు, పోరంబోకు స్థలాలు ఆక్రమణలకు పాల్పడితే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. ఈ స్థలాన్ని ప్రభుత్వ స్థలంగా తెలియజేస్తూ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని వీఆర్వోను ఆదేశించారు.

డిగ్రీ కాలేజీలో లాలా లజపతిరాయ్ జయంతి వేడుక

గుమ్మలక్ష్మీపురం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లాలా లజపతిరాయ్ జయంతిని చరిత్ర శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీ వరం మాట్లాడుతూ లాలా లజపతిరాయ్ జీవిత చరిత్ర, ఆయన దేశానికి చేసిన సేవలను, భారతదేశానికి స్వాతంత్ర్యం కోసం చేసిన సేవను విద్యార్థులకు తెలిపారు. అటువంటి మహోన్నత వ్యక్తిని విద్యార్థులు ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని కోరారు. చరిత్ర అధ్యాపకులు శ్రీవాణి మాట్లాడుతూ లాలా లజపతిరాయ్ గొప్ప స్వాతంత్ర్య పోరాట యోధడని, పంజాబ్ కేసరి అని, ఆయనలా ధైర్యసాహసాలు విద్యార్థులకు ఉండాలని అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రామయ్య, అధ్యాపకులు సింహాచలం పాల్గొన్నారు.